క్లుప్తంగా

భువనేశ్వరస్వామి ఆలయంలో చోరీ

సీతానగరం: మండలంలోని మరిపివలసలో గల భువనేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం మధ్యాహ్నం స్వామివారి పూజా సామగ్రి(ఇత్తడి పాత్రలు)చోరీకి గురైనట్లు అర్చకుడు డి.సురేష్ తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ఆలయం తలుపులకు తాళాలు వేయక పోవడంతో దుండగులు తలుపులుతీసి స్వామివారి చెంత ఉన్న సామగ్రి చోరీ చేసినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలియ జేసారు. ఫిర్యాదు మేరకు ఎస్సై కె.నీలకంఠం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

1278 సవరణ దరఖాస్తులు

పార్వతీపురంటౌన్: నియోజకవర్గ స్థాయి ఇంటింటి ఓటరు సర్వేలో భాగంగా ఇప్పటివరకు 1278 సవరణ దరఖాస్తులు అందాయని పార్వతీపురం నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఆర్డీఓ కె.హేమలత తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఓటరు సమ్మరీ రివిజన్‌లో హౌస్‌టు హౌస్ సర్వే ద్వారా ఓటర్ జాబితాలో ఉన్న తప్పిదాలను- డోర్ నంబర్ '0' ఉన్నవి. జంక్ క్యారెక్టర్స్ ఉన్నవి. ఒకే ఇంటిలో పది మంది కన్నా ఎక్కువ మంది ఓటర్లు ఉన్నట్లు కానీ, వాస్తవంగా వేరే కుటుంబాలుగా ఉన్న ఓటర్లను గుర్తించి సరిచేయడానికి, రెండు శాతం కన్నా ఎక్కువ తొలగింపులు జరిగిన పోలింగ్ కేంద్రాల వద్ద తప్పిదాలు ఏవైనా ఉన్నాయా? లేవా? అని చూడడానికి, ఓటరుగా నమోదు కాని యువతను గుర్తించి వారికి ఓటుహక్కు కల్పించడానికి బూత్‌స్థాయి అధికారుల ద్వారా సర్వే చేసినట్లు ఆర్డీఓ కె.హేమలత వివరించారు.

భూముల వివరాలు నమోదు

భామిని: మండలంలోని బిల్లుమడలో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు-శాశ్వత భూసర్వేలో భాగంగా ఆదివారం రైతుల నుంచి వివరాలు సేకరించారు. ఇప్పటికే గ్రామంలో చేపట్టిన భూసర్వేలో రైతుల భూమిహక్కు పత్రాలు, ఆధార్, పట్టాదారు పుస్తకాల జిరాక్సులు తీసుకొని వివరాలు నమోదు చేశారు. వీఆర్‌ఓ సిర్ల జయరాజ్, వీఆర్‌ఏ నిమ్మల కర్ణ, సహాయ సర్వేయర్లు భూముల రీసర్వే వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు: సీఐ

పాలకొండ: మైనర్లు వాహనాలు నడపడం ద్వారా రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, తల్లిదండ్రులు మైనర్లయిన తమ పిల్లలకు వాహనాలు ఇవ్వొద్దని సీఐ మురళీధర్ సూచించారు. వీరఘట్టం-పాలకొండ రోడ్డులో ఆదివారం వాహన తనిఖీలు చేపట్టారు. రోడ్డు భద్రత నిబంధనలపై వాహన చోదకులకు అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. పిల్లలు చేసే తప్పులకు తల్లిదండ్రులు బాధ్యత వహించాల్సి వస్తుందని, కాబట్టి తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై దృష్టి సారించాలని సూచించారు. ఆటో డ్రైవర్లు పరిమిత వేగంతో ఆటోలు నడపాలన్నారు.


రహదారిపై చేరిన వర్షపునీరు

కొమరాడ: పార్వతీపురం నుంచి కూనేరు మార్గంలో పలుచోట్ల రహదారి అధ్వానంగా తయారైంది. గత ఏడాది ప్రభుత్వ నిధులతో రహదారితో ఉన్న గోతులను పూడ్చి మరమ్మతులు చేపట్టారు. అయితే సంబంధిత కాంట్రాక్టర్ కాసులకు కక్కుర్తి పడి నాశిరకంగా పనులు చేపట్టడంతో ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డుపై గోదులు ఏర్పడ్డాయి. అంత రాష్ట్ర రహదారి కావడంతో ఈ మార్గంలో నిత్యం భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో ఆ గోతులు పెద్దవై ప్రమాదకరంగా మారాయి. అధికారులు స్పందించి రోడ్డుపై చేరిన వర్షపు నీటిని తొలగించి గోతులు పూడ్చాలని, అలాగే నాశిరకంగా మరమ్మతు పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదివారం సీపీఎం నాయకులు నిరసన తెలియజేశారు.

పాముకాటుతో మహిళకు అస్వస్థత

కురుపాం: పాముకాటుకు గురై ఓ మహిళ ఆస్పత్రి పాలైన సంఘటన మండలంలోని జి.శివడ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కె.వరలక్ష్మి ఇంటి పెరట్లో పనిచేస్తుండగా ఆమె ఎడమ చేతిపై పాము కాటేసింది. అస్వస్థతకు గురైన ఆమెను కుటుంబ సభ్యులు మొండెంఖల్లు పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం భద్రగిరి సీహెచ్‌సీకి రిఫర్ చేశారు.


భాగవత సప్తాహం



భాగవత సప్తాహంలో పాల్గొన్న భక్తులు

గరుగుబిల్లి: తోటపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి (శృంగార వల్లభస్వామి) దేవస్థానంలో భాగవత సప్తాహ కార్యక్రమం ఆదివారం ప్రారంభమైంది. విశ్రాంతి తెలుగు పండిట్ పి.సింహాచలం బమ్మెర పోతన రాసిన శ్రీమదాంధ్ర మహాభాగవతంలోని అంశాలను పారాయణం చేశారు. లోక కళ్యాణం కోసం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బి.లక్ష్మినగేష్ తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు ద్వారపురెడ్డి ధనంజయరావు, జట్టు ట్రస్ట్ అధినేత డొల్లు పారినాయుడు, ఆవాల కన్నయ్య, శ్రీరామచంద్రమూర్తి, పలువురు భక్తులు పాల్గొన్నారు.

విలేజ్ క్లినిక్‌లతో మెరుగైన వైద్యసేవలు



జగ్గునాయుడుపేటలో వైఎస్సార్ విలేజ్ క్లినిక్ భవనం

సీతానగరం: రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక రోగులకు ఇళ్ల వద్దకే ఉచిత వైద్య సేవలు అందుతున్నాయి. గ్రామాల్లోనే సచివాలయానికి ఒకటి వంతున వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు ఏర్పాటు చేసింది. రూ.లక్షలు వెచ్చించి మౌలిక సదుపాయాలు కల్పించి సొంత భవనాలు నిర్మించారు. ఇక్కడ వ్యాధుల నిర్ధారణకు వైద్య అధికారి, సిబ్బందిని నియమించడం, 74 రకాల మందులతో వైద్య సేవలు అందుబాటులోకి రావడంతో రోగులకు అవస్థలు తప్పాయి. ఆర్.వెంకంపేటలో ఏర్పాటు చేసిన విలేజ్ క్లినిక్‌లో రామవరం, రెడ్డివానివలస, బక్కుపేట, జగ్గునాయుడుపేట గ్రామాల వారికి వైద్య సేవలు అందుతున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్‌కు రిఫర్ చేస్తున్నారు. జగ్గునాయుడుపేట క్లినిక్‌లో రోజుకు 40 నుంచి 50 మంది వైద్య సేవలు పొందుతున్నారు. ఆరోగ్యశ్రీలో శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారికి కూడా వైద్య సేవలు అందిస్తున్నారు.



విలేజ్ క్లినిక్‌లో రోగులకు తనిఖీలు

అందుబాటులోకి వైద్యసేవలు



జగనన్న ప్రభుత్వం మా గ్రామంలో వైఎస్సార్ విలేజ్ క్లినిక్ ఏర్పాటు చేయడంతో మాలాంటి దీర్ఘకాలిక రోగులకు వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. పట్టణ ప్రాంతాలకు పరుగులు తప్పాయి. చిన్నపాటి అనారోగ్యానికి గురైనా వైద్యులు తక్షణమే ఆదుకుంటున్నారు. విలేజ్ క్లినిక్‌ల ఏర్పాటుతో మాలాంటి పేదలకు ఇంటి వద్దనే మెరుగైన వైద్యసేవలు సకాలంలో అందుతున్నాయి. సీఎం జగనన్నకు రుణపడి ఉంటాం.

– మరడాన క్రిష్ణమ్మ, జగ్గునాయుడుపేట, సీతానగరం మండలం

అర్హులందరికీ ఓటు హక్కుకు ప్రత్యేక డ్రైవ్



వెంకటాపురంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ రమేష్

సీతానగరం: మండలంలోని అర్హులైన వారందరికీ ఓటుహక్కు కల్పించడానికి అసిస్టెంట్ ఎన్నికల అధికారుల పర్యవేక్షణలో పోలింగ్ స్టేషన్‌లలో అర్జీల స్వీకరణ జరుగుతోందని 118,119,120,121, 122,123 పోలింగ్ స్టేషన్‌ల సూపర్‌వైజర్ రమేష్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఏగోటివలస, వెంకటాపురం, లక్ష్మీపురం, నీలకంఠాపురం పోలింగ్ స్టేషన్‌లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వెంకటాపురంలో మాట్లాడుతూ అనర్హత ఓట్లను తొలగించడానికి ముందుగా నోటీసులు ఇచ్చిన అనంతరం ఓటరు అనుమతి తప్పనిసరి అని స్పష్టం చేశారు. అలాగే అర్హులైన వారంతా బీఎల్వోలకు ఓటరు చేర్పు నమోదు అర్జీలు సమర్పించి తగిన రసీదు పొందాలని సూచించారు. అర్హులైన వారందరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా ప్రత్యే డ్రైవ్ జరుగుతోందన్నారు. అర్హులైన ఓటర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ఓటర్ల నమోదు అర్జీలను, తొగించే అర్జీలను పరిశీలించారు.కార్యక్రమంలో బీఎల్వోలు పాల్గొన్నారు.


ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి



నిర్మాణంలో ఉన్న ఇళ్లు

సీతానగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతి ఒక్కరికీ సొంత ఇల్లు ఉండాలనే సంకల్పంతో లక్షలాది రూపాయల విలువైన స్థలాన్ని సమకూర్చి, ఇంటి నిర్మాణానికి నిధులు మంజూరు చేసినందున లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్, ఏఈ జానకీరాం కోరారు. ఈ మేరకు వారు ఆదివారం మండల కేంద్రంలోని జగనన్న కాలనీల్లో జరుగుతున్న ఇళ్ల నిర్మాణంపై ఆరాతీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని జగనన్న కాలనీల్లో చేపడుతున్న ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయడానికి ఇంజినీరింగ్ సహాయకులు లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని కోరారు. ఇప్పటికే జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం చేపట్టడానికి నీరు, విద్యుత్, రోడ్ల సౌకర్యం, ఆర్థికంగా వెనుకబడిన వారికి ప్రభుత్వం వెలుగు ఆధ్వర్యంలో రూ.35 వేల రుణసౌకర్యం కల్పించినట్లు చెప్పారు. ఈ విషయాలపై లబ్ధిదారులకు ఇంజినీరింగ్ సహాయకులు అవగాహన కల్పించి సకాలంలో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి సొంతింటి కల నెరవేరేలా చేయాలని కోరారు. అనంతరం ఇంతవరకూ నిర్మించిన గృహాలు, ప్రారంభించని ఇళ్లపై సమీక్షించారు.

మీనామృతంతో చీడపీడలకు చెక్



మీనామృతం తయారీపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

గరుగుబిల్లి: పంటలను ఆశించే చీడపీడల నివారణకు మీనామృతంతో చెక్ పెట్టొచ్చని ప్రకృతి వ్యవసాయం మండల ఇన్‌చార్జ్ పోలినాయుడు అన్నారు. మండలంలో ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలు సాగు చేస్తున్న చిలకాం, నందివానివలస, దళైవలస గ్రామాల రైతులకు మీనామృతం తయారీపై ఆదివారం అవగాహన కల్పించారు. 3 కిలోల చేపల వ్యర్థాలు, నల్ల బెల్లాన్ని ఒక తొట్టిలో తీసుకుని 15 రోజులు మరగబెట్టాలి. అలా వచ్చిన కషాయాన్ని ఎకరాకు రెండుమార్లు పిచికారీ చేసుకోవడం ద్వారా తెగుళ్ల వ్యాప్తి, ఉధృతిని నివారించవచ్చని సూచించారు.

నేడు గజాలఖానా సమీపంలో భూసర్వే

పాలకొండ రూరల్: భూముల సమగ్ర రీసర్వేలో భాగంగా సోమవారం ఉదయం 7 గంటలకు వీరఘట్టం రహదారిలో గజాలఖానా వంతెన దిగువన ఉన్న భూములు, తోటలను సర్వే చేయనున్నట్లు తహసీల్దార్ పి.సోమేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ ప్రాంతంలో భూములు, తోటలు ఉన్న రైతులు, హక్కుదారులు పట్టాదారు పాసుపుస్తకాలు పట్టుకుని పొలం వద్దకు చేరుకోవాలని సూచించారు. సర్వే ప్రక్రియకు సహకరించాలని కోరారు.

రైతు సంఘం నాయకుల వినతి

పాలకొండ: ఖరీఫ్‌లో ధాన్యం రవాణా ఛార్జీలపై పూర్తి స్థాయిలో విచారణ జరపాలని రైతు సంఘం నాయకులు సబ్ కలెక్టర్ నూరుల్ కమర్‌కు ఫిర్యాదు చేశారు. రైతులు తమ సొంత ఖర్చులతో ధాన్యం రవాణా చేయగా.. దళారీలు రవాణా ఛార్జీలు దోసుకున్నారని రైతు సంఘం నాయకుడు బుడితి అప్పలనాయుడు ఆరోపించారు. దీనిపై వివరాలు అందించేందుకు సివిల్ సప్లై అధికారులు ముందుకు రావడం లేదని పేర్కొన్నారు. ఉన్నత స్థాయి అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో విచారణ జరిపి రైతులకు న్యాయం చేయాలని విన్నవించారు.

శిలాఫలకానికే పరిమితమైన టీడీపీ హామీ

వీరఘట్టం: సార్వత్రిక ఎన్నికల్లో కళింగ వైశ్యుల ఓట్లు కోసం టీడీపీ ఆడిన డ్రామాకు స్థానిక అగ్రహారం వీధిలో ఉన్న శిలాఫలకమే సజీవ సాక్ష్యం. వీరఘట్టంలో 331 కళింగ వైశ్య కుటుంబాల్లో సుమారు 1100 మంది ఓటర్లు ఉన్నారు. వారిని ఆకట్టుకునేందుకు సామాజిక భవనాన్ని నిర్మిస్తామని టీడీపీ ప్రభుత్వం హామీ ఇచ్చింది. 2018 జూన్ 17న అప్పటి రాష్ట్ర ఇంధనశాఖ మంత్రి కళా వెంకటరావు రూ.15 లక్షల వ్యయంతో సామాజిక భవనం నిర్మాణానికి శిలాఫలకం ఆవిష్కరించారు. కానీ నిధులు కేటాయించకపోవడంతో భవనం కోసం ఎదురు చూసిన కళింగ వైశ్యులకు నిరాశే మిగిలింది. అయితే ఇటీవల భవిష్యత్‌కు గ్యారంటీ అంటూ టీడీపీ నేతలు చేపట్టిన బస్సుయాత్ర వీరఘట్టం వచ్చిన కళా వెంకటరావు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై విమర్శలు చేయడంపై స్థానికులు మండిపడ్డారు. కళింగవైశ్య సామాజిక భవనం కట్టిస్తామని చెప్పి శిలాఫలకంతో సరిపెట్టిన మాజీ మంత్రి ఏ మొహం పెట్టుకుని ఈ ప్రాంతానికి వచ్చారని పలువురు ప్రశ్నించారు.

శరవేగంగా ఆస్పత్రి భవన నిర్మాణాలు

- సుమారు 27 కోట్ల రూపాయల కేటాయింపు
- మంత్రి పీడిక రాజన్నదొర చొరవతో నిధులు మంజూరు



నిర్మాణంలో ఉన్న మామిడిపల్లి పీహెచ్‌సీ భవనం



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న చల్లపేట పీహెచ్‌సీ భవనం

సాలూరు: శిథిలావస్థకు చేరిన ఆస్పత్రి భవనాలు.. చాలీచాలని పరికరాలు.. అరకొరగా వైద్యసిబ్బంది.. ఇది గత టీడీపీ హయాంలో ప్రభుత్వాస్పత్రుల పరిస్థితి.. వైఎస్సార్‌సీపీ హయాంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి వైద్యరంగానికి పెద్దపీట వేశారు. నాడు – నేడు కార్యక్రమంలో ప్రభుత్వ ఆస్పత్రులను కార్పొరేట్ స్థాయికి అభివృద్ధి చేశారు. సరిపడా సిబ్బంది నియామకం, అధునాతన పరికరాల ఏర్పాటుతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజల పట్ల తనకున్న చిత్తశుద్ధి చాటుకున్నారు. ఇదే సమయంలో ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందాలన్న తలంపుతో నియోజకవర్గంలో ఆస్పత్రులు అభివృద్ధి చెందడంలో తనవంతు పాత్ర పోషించారు.

పీడిక రాజన్నదొర చొరవతో..

ప్రజారోగ్యం విషయంలో ఏనాడు రాజీపడని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర నియోజకవర్గంలో ప్రభుత్వ ఆస్పత్రుల భవన నిర్మాణాలు, ఆధునీకరణపై ప్రత్యేక దృష్టి సారించారు. గత టీడీపీ ప్రభుత్వం ఎన్నికల ముందు కొబ్బరికాయలు కొట్టి పనులు ప్రారంభించకుండా వదిలేసిన పట్టణంలో వంద పడకల ఆస్పత్రి నిర్మాణం కోసం రాజన్నదొర చేసిన కృషి అనిర్వచనీయం. ఈ ఆస్పత్రి నిర్మాణ ఆవశ్యకతను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి సుమారు 17 కోట్ల రూపాయలు మంజూరు చేయించారు. ప్రస్తుతం ఆస్పత్రి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ ఏడాది చివరకు ప్రారంభించే దిశగా చర్యలు తీసుకుంటున్నారు.

సుమారు 10 కోట్లతో ఆస్పత్రి భవనాలు..

సాలూరు మండలంలోని మామిడిపల్లి, తోణాం.. ,మక్కువ మండలంలో మక్కువ, శంబర.. మెంటాడ మండలంలో చల్లపేట, తదితర పీహెచ్‌సీల ఆస్పత్రి భవన నిర్మాణాలు, ఆధునీకరణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. వర్షం వస్తే స్థానిక గోముఖి నది పొంగి పూర్తిగా మునిగిపోయే మామిడిపల్లి పీహెచ్‌సీ దుస్థితి నేడు మారిపోయింది. సురక్షిత ప్రాంతంలో భవన నిర్మాణాలు జరుగుతున్నాయి. సుమారు కోటీ 82 లక్షల రుపాయలతో మామిడిపల్లి పీహెచ్‌సీ భవనం.. సుమారు కోటీ 82 లక్షల రుపాయలతో తోణాం పీహెచ్‌సీ భవనం.. సుమారు 2 కోట్ల 42 లక్షల రుపాయలతో మక్కువ పీహెచ్‌సీ భవనాలు నిర్మిస్తున్నారు. అలాగే కోటీ 89 లక్షల రుపాయలతో శంబర పీహెచ్‌సీ భవనం దాదాపు పూర్తయింది. మెంటాడ మండలంలో సుమారు కోటీ 74 లక్షల రుపాయలతో నిర్మించిన చల్లపేట పీహెచ్‌సీని వచ్చే నెలలో ప్రారంభించే అవకాశం ఉంది.

జగనన్నకు, రాజన్నకు ధన్యవాదాలు..



సుమారు 104 గ్రామాలకు తోణాం పీహెచ్‌సీయే ఆధారం. సీజనల్ వ్యాధులు ప్రబలే సమయంలో వందల మంది గిరిశిఖర గిరిజనులు ఇక్కడకు వస్తుంటారు. సరైన భవనం లేక గతంలో ఎన్నో ఇబ్బందులు పడ్డాం. రాజన్నదొర చొరవతో కొత్త భవనం నిర్మిస్తున్నారు. ముఖ్యమంత్రి జగనన్నకు, మంత్రి రాజన్నకు ప్రత్యేక ధన్యవాదాలు.

– మువ్వల ఆదయ్య, సర్పంచ్, తోణాం

వాహన చోదకులు పాత బకాయిలు చెల్లించాలి



వాహనాల రికార్డులను పరిశీలిస్తున్న ఏఎస్సై శ్రీనివాసరావు

సీతానగరం: మండలంలోని వివిధ ప్రాంతాల్లో వాహనాల తనిఖీ సమయంలో వాహన చోదకులకు పోలీసులు విధించిన అపరాధ రుసుం చెల్లించని వారంతా ఇప్పుడు బకాయిలు చెల్లించాలని ఏఎస్సై శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు ఆదివారం ఎస్సై కె. నీలకంఠం పర్యవేక్షణలో రాష్ట్ర రహదారిలో హనుమాన్ జంక్షన్ వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో వాహనాలను తనిఖీ చేసి అపరాధ రుసుం విధించినట్లు తెలియజేశారు. ఆన్‌లైన్ విధానం ద్వారా చెల్లించాల్సిన రుసుం సకాలంలో చెల్లించక పోవడంతో పెండింగ్‌లో ఉన్నాయని, బాకీలను ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలని కోరుతూ వాహనాలు తనిఖీ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా దమ్ము పనులు



చినభోగిలిలో వరినాట్లు వేస్తున్న మహిళలు

సీతానగరం: మండలంలోని పలు గ్రామాల్లో కాలువలు, బోర్లు, వర్షం నీరు అందుబాటులో ఉండడం వల్ల వరినారు అందివచ్చిన చోట దమ్ము చేసే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. ఈ మేరకు మండలంలోని చినభోగిలి, కాశీపేట, అంటిపేట, వెంకటాపురం, తామరఖండి, బళ్లకృష్ణాపురం, బక్కుపేట, గాదెలవలస తదితర గ్రామాల్లో ఉభాలు జరుగుతున్నాయి. ఇప్పటికే వరియదలు పోయడం వల్ల మొక్కలు ఏపుగా పెరగడంతో కలుపు నివారణ పనులు చేస్తున్నారు. ఈ విషయమై ఏఓ ఎస్.అవినాష్ వద్ద ప్రస్తావించగా వరినారు ఏపుగా పెగిన పొలాల్లో ఉభాలు చేస్తున్నరన్నారు. ముందు నుంచి కలునివారణ, ఎరువుల యాజమాన్యం, నీటి యాజమాన్య పద్ధతులను పాటించాలని రైతులకు రైతు భరోసా కేంద్రాల్లో అవగాహన సదస్సులు నిర్వహించినట్లు చెప్పారు.

అత్యవసర సేవల సిబ్బందికి శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఫ్లీట్ మేనేజర్ భాస్కరరావు

పార్వతీపురం టౌన్: అత్యవసర సేవల (102, 104, 108) వాహనాల జిల్లా ఫ్లీట్ మేనేజర్ భాస్కరరావు వాహనాల పైలట్లకు జిల్లా ఆస్పత్రి సమీపంలోని రెవెన్యూ హోంలో ఆదివారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా వాహనాల కండిషన్‌ను ఎప్పటికప్పుడు పరిశీలించి వాహనాలకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకుని రావాలని సూచించారు. వాహనాల రికార్డులను, ఫిట్‌నెస్‌ను, వాటి పరిస్థితిని పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రికి తరలిస్తున్న రోగులకు మంచి సేవలను అందించాలని కోరారు. వాహనాల పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేసి 102, 104, 108 సేవల పట్ల సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో 108 జిల్లా మేనేజర్ మన్మథ నాయుడు, 102, 104, 108 ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ విజయకుమార్ రాజశేఖర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లైంగికదాడి దోషులను కఠినంగా శిక్షించాలి



ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి వద్ద నిరసన తెలుపుతున్న పీడీఎస్‌ఓ నాయకులు

పార్వతీపురంటౌన్: మణిపూర్‌లో ఇద్దరమ్మాయిలను నగ్నంగా ఊరేగించి లైంగికదాడికి పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని పీడీఎస్‌ఓ ఆధ్వర్యంలో ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి డిమాండ్ చేస్తూ తహసీల్దార్ కార్యాలయం మీదుగా వైఎస్సార్ విగ్రహం వరకు నిరసన ర్యాలీ చేసి నిరసన తెలియజేశారు. ఈ మేరకు పీడీఎస్‌ఓ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు కె.సోమేష్ మాట్లాడుతూ మణిపూర్ ఘటన యావత్ భారతదేశాన్ని సిగ్గుతో తలదించుకునేలా చేసిందన్నారు. మహిళలను ఎంతో గౌరవిస్తామని చెప్పుకుంటున్న కేంద్ర ప్రభుత్వం కనీసం ఈ విషయంపై మాట్లాడకపోవడంతో మహిళల రక్షణకు ప్రభుత్వాలు ఎంత ప్రాధాన్యం ఇస్తున్నాయో అర్థం అవుతోందని విమర్శించారు. ర్యాలీలో పీడీఎస్‌ఓ నాయకులు చిరంజీవి, సోమశేఖర్ పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

డీలరు రాజు మృతి తీరని లోటు

సీతానగరం: మండలంలోని పెదభోగిలి గ్రామానికి చెందిన రేషన్‌డిపో 1 డీలర్ సవరపు రాజు మృతి తీరని లోటని రేషన్ లబ్దిదారులు అన్నారు. దీర్ఘకాలంగా డీలరుగా సేవలందించిన రాజు అనారోగ్యానికి గురవడంతో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. డీలర్ రాజు మృతి సమాచారంతో మంచివ్యక్తిని కోల్పోయామని గ్రామ ప్రజలు ఆవేదన వెలిబుచ్చారు. రాజు మృతి వార్త తెలుసుకున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.